గుర్రాలగొందిని ఆదర్శంగా తీర్చిదిద్దాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నారాయణరావుపేట, మే 31: బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ఆశీస్సులతో సిద్దిపేట లోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నామని, గుర్రాలగొంది గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం మండలం లోని గుర్రాలగొందిలో జరుగుతున్న మహంకాళి దేవాలయ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి మాటలు ఎక్కువ చేతలు తక్కువ అయ్యాయన్నారు. పంట రుణమాఫీ చేశామని అబద్ధాలు చెబుతున్నాడన్నారు. వానకాలం రైతుబంధు ఎగ్గొట్టి, యాసంగి సగం మందికి మాత్రమే ఇచ్చాడన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతు చనిపోతే దశదినకర్మ అయ్యేలోపే రైతుబీమా ఇచ్చే వాళ్లమని రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాత అది కూడా బంద్ అయ్యిందన్నారు. రూ.200 ఉన్న పింఛన్ కేసీఆర్ రూ.2 వేలు చేశాడని, రూ.4 వేలు ఇస్తానన్న రేవంత్‌రెడ్డి పాత పింఛన్ ఇచ్చుకుంటా రెండు నెలలు ఎగ్గొట్టాడన్నారు. కేసీఆర్ హయాంలో ఎకరం రూ.40 లక్షలు ఉంటే, ఇప్పుడు రూ.20 లక్షలకు కూడా అమ్ముడుపోని దుస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ హరీశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

సిద్దిపేట, మే 31: కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల గోదావరి జలాలతో నేడు చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకుతున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణం ఒకటో వార్డు లింగారెడ్డిపల్లిలో గ్రామ దేవతల ప్రతిష్ఠలో ఆయన పాల్గొన్నారు. వనదుర్గాదేవి, పెద్దమ్మతల్లి, మహంకాళి అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అమ్మవార్లకు పూజలు చేయాలని, దేవుడి మీద మనస్సు పెట్టి పూజలు చేయడం ముఖ్యమన్నారు. మున్సిపల్‌లో లింగారెడ్డిపల్లి విలీనం తర్వాత ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, కౌన్సిలర్ విజేందర్‌రెడ్డి, నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, బోండ్ల రామస్వామి, బాలయ్య, మహేశ్, అశోక్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

గుర్రాలగొందిలో మహంకాళి మాతను దర్శనం చేసుకుంటున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట: ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం

మద్దూరు(ధూళిమిట్ట), మే 31: మద్దూరు మండలం గాగిళ్లాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు దేవతామూర్తులకు పంచామృతాభిషేకాలు, వేంకటేశ్వరస్వామి హోమం, 10:30 గంటలకు వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం తీర్థప్రసాద వితరణ, మహా అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి: హరీశ్‌రావు

కొండపాక(కుకునూర్‌పల్లె), మే 31: రేణుకా ఎల్లమ్మ దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. కుకునూర్‌పల్లెలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పునర్నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా శనివారం ఆయన హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించి ఎల్లమ్మతల్లి ప్రతిమ అందజేశారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దేవీరవీందర్, ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మాజీ సభ్యురాలు కొల సద్గుణారవీందర్, పీఏసీఎస్ కొండపాక చైర్మన్ అమరేందర్, బీఆర్ఎస్ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు కిరణ్‌కుమార్, మహిపాల్, కనకయ్య, బీఆర్ఎస్ నాయకులు ఐలయ్య, సంపత్, కొంతంరాజు, బాలాగౌడ్, గౌడసంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న గౌడసంఘం నాయకులు

మృతుడి కుటుంబానికి హరీశ్‌రావు పరామర్శ

నంగునూరు, మే 31: మండలంలోని పాలమాకుల గ్రామానికి చెందిన రంగురాహుల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటానని ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాహుల్ కుటుంబీకులను పరామర్శిస్తున్న హరీశ్‌రావు

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

కోహెడ, మే 31: మృతుల కుటుంబాలకు శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి ఆర్థిక సాయం అందజేశారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ రజతోత్సవసభ రోజు బస్వాపూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కమ్మరి గణేశ్, తాలం సారయ్య మృతి చెందారు. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున చెక్కులను పార్టీ తరపున అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ కొక్కుల కీర్తి సురేశ్, హుస్నాబాద్ నాయకులు తిరుపతిరెడ్డి, కోహెడ నాయకులు ఆవుల మహేందర్, కొక్కుల రమేశ్, కోహెడ మాజీ వైస్ చైర్మన్ తడకల రాజిరెడ్డి, పోలవేని కుమారస్వామి, తోట ఆంజనేయులు, ఆవుల మహేందర్, మాజీ ఎంపీపీ తిప్పారపు శ్రీకాంత్, పిల్లి రాజయ్య పాల్గొన్నారు.

మృతుల కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సమాజ శ్రేయస్సుకు కృషిచేయాలి

సిద్దిపేట కమాన్, మే 31: సిద్దిపేట పద్మశాలి సమాజం నూతన కార్యవర్గ సభ్యులు శనివారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా వారికి హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. సమాజ శ్రేయస్సుకు నిత్యం పాటు పడాలని సూచించారు. పద్మశాలి సమాజానికి సంపూర్ణ సహకారం ఉంటుందని ఆయన చెప్పారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావుతో సిద్దిపేట పద్మశాలి సమాజం నూతన కార్యవర్గ సభ్యులు

ఆధ్యాత్మికను ఒడిసి పట్టిన నేల సిద్దిపేట

సిద్దిపేట, మే 31 : ''సిద్దిపేట ఆధ్యాత్మికతను ఒడిసి పట్టిన నేల.. కళాకారులు, గాయినీ గాయకులకు పెట్టింది పేరు'' అని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో జరిగిన శ్రీహరి పదార్చన శ్రీనివాసుడి కల్యాణోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేటలో తిరుపతి దేవస్థాన ఉత్సవ విగ్రహలతో కల్యాణం జరగడం సంతోషమన్నారు. సిద్దిపేటకు వచ్చిన గాయని శోభారాజు, ఆధ్యాత్మిక ప్రచారకులు భారతీయం సత్యవాణి స్వాగతమని తెలిపారు. త్వరలో రూ.10 కోట్లతో సిద్దిపేట కోమటి చెరువు బైపాస్ రోడ్డు వైపు టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

నేడు తీగుల్‌లో హరీశ్‌రావు పర్యటన

జగదేవపూర్, మే 31: మండలంలోని తీగుల్‌లో ఆదివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం తీగుల్‌లో స్థానిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు తెలంగాణతల్లి విగ్రహావిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. గజ్వేల్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

ఉద్యోగులకు విరమణ తప్పదు

గజ్వేల్, మే 31: ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పదని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్‌లో మున్సిపల్ ఉద్యోగి సత్తయ్య విరమణ సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నర్సయ్య కార్యాలయ ఉద్యోగులతో కలిసి సన్మానించారు. మున్సిపల్ మాజీ చైర్మన్లు రాజమౌళి, భాస్కర్, మాజీ కౌన్సిలర్లు, పట్టణవాసులు పాల్గొన్నారు.

సత్తయ్యను సన్మానిస్తున్న యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

ఆహ్వాన పత్రిక అందజేత

గజ్వేల్, మే 31: పట్టణంలో నూతనంగా నిర్మించనున్న పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముదిరాజ్ సంఘం నాయకులు శనివారం అందజేశారు. సోమవారం ఉదయం పట్టణ సమీపంలోని ఎర్రకుంట వద్ద ఆలయ నిర్మాణానికి నిర్వహించే భూమిపూజలో పాల్గొనాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గుంటుక రాజు, కొట్టాల శ్రీనివాస్, శ్రీనివాస్, ఆంజనేయులు, రమేశ్, యాదగిరి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

బీఆర్ఎస్ నాయకుడి కుటుంబీకులకు పరామర్శ

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కర్ర శ్రీహరి

కోహెడ, మే 31: మండలంలోని నాగసముద్రాల మాజీ సర్పంచ్ పారునంది దుర్గయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తైదల రవీందర్, చామంతుల రాజమల్లయ్య, నాయకులు చింతలపెల్లి కాంతారెడ్డి, సందవేని మల్లేశం, సందవేని రవి, నారాయణ, ర్యాగటి వెంకటయ్య, చింతలపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పారునంది బాలయ్య, ముడిపెల్లి బాలయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి చాడ పరామర్శ

హుస్నాబాద్‌టౌన్, మే 31: హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ నాయకుడు మోర శ్రీహరి అకాల మరణం పట్ల సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని మోర శ్రీహరి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం పట్టణానికి చెందిన గంగరవేని రాజయ్య కుటుంబ సభ్యులను సైతం పరామర్శించారు. సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశ్, సుదర్శనాచారి, పద్మ ఉన్నారు.

సన్న బియ్యం సరఫరా చేయాలి

సిద్దిపేట, మే 31: ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకే సారి జూన్‌లో లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు చౌకధరల దుకాణాలకు సరఫరా చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం సిద్దిపేట మార్కెట్ యార్డులోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆయన సందర్శించారు. మండలాల్లోని రేషన్ దుకాణాలకు లారీల ద్వారా బియ్యం సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం సరఫరా చేసేందుకు సరిపడా వాహనాలు సమకూర్చి హమాలీల కొరత లేకుండా చూసుకుని లబ్ధిదారులకు ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ప్రవీణ్‌ను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 686 చౌకధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్, సిద్దిపేట ఆర్డీవో సదానందం పాల్గొన్నారు.

సిద్దిపేట ఎంఎల్ఎస్ పాయింట్‌ను సందర్శించిన కలెక్టర్ మనుచౌదరి

వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

సిద్దిపేట, మే 31: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్ పక్కన క్రికెట్ స్టేడియంలో జూన్ 2 రాష్ట్ర అవతరణ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్ పక్కన మినీస్టేడియం, ముస్తాబాద్ చౌరస్తాలోని తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ విగ్రహం, రంగధాంపల్లి అమరవీరుల స్తూపాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, జిల్లా ప్రజలు, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవో సదానందం, అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, పోలీస్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, సమాచార పౌరసంబంధాలశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కూరగాయల మొక్కలు నాటాలి

సిద్దిపేట, మే 31: ప్రభుత్వ పాఠశాలల్లో న్యూట్రీ గార్డెన్లు ఏర్పాటు చేసి కూరగాయల మొక్కలు నాటాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కూరగాయ మొక్కలు నాటేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. మునగ, కరివేపాకు, ఆకుకూరల లాంటి మొక్కలకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలి

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అన్నారు. కలెక్టరేట్‌లో సీజనల్ వ్యాధులు, నివారణ చర్యలపై జిల్లా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత లోపించడం, నీరు కలుషితం కావడం వల్ల దోమలు, ఈగలు వృద్ధిచెంది అంటువ్యాధులు వేగంగా విస్తరించే అవకాశం ఉందన్నారు. కలుషిత నీటిని ప్రజలు తాగడం వల్ల డయేరియా,అతిసారం, వాంతులు, విరోచనాలు వస్తాయన్నారు. సీజనల్ వ్యాధుల గురించి సమస్యలు, సందేహాలుంటే టోల్ ఫ్రీ 63018 13936 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, డీఆర్‌వో నాగరాజమ్మ, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఉపవైద్యాధికారి రేవతి, మెడికల్ సూపరింటెండెంట్లు, ప్రోగ్రాం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పొగాకుకు దూరంగా ఉండాలి

సిద్దిపేట టౌన్,మే 31: పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరం..అందరూ పొగాకుకు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట జిల్లా కోర్టు సమావేశం మందిరంలో ప్రపంచపొగాకు వ్యతిరేక దినోత్సవం జరిగింది. అనంతరం న్యాయ సిబ్బంది, న్యాయవాదులు, ఉద్యోగులతో పొగాకు ఉత్పత్తులు వినియోగించకూడదని ప్రతిజ్ఞ చేయించారు.

పొగాకు ఉత్పత్తులు వాడమని ప్రతిజ్ఞ

హుస్నాబాద్‌టౌన్, మే 31: హుస్నాబాద్ మున్సిఫ్‌కోర్టులో శనివారం పొగాకు ఉత్పత్తులు వాడమని ప్రతిజ్ఞ చేశారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జూనియర్ సివిల్ జడ్జి రేవతి ఆధ్వర్యంలో కోర్టు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

పొగాకు ఉత్పత్తులు వాడొద్దని ప్రతిజ్ఞ చేయిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రేవతి

ఆలయానికి భూమి పూజ

జగదేవపూర్, మే 31: మండలంలోని చాట్లపల్లిలో కుర్మసంఘం ఆధ్వర్యంలో శనివారం బీరప్ప ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కుర్మసంఘం నాయకులు కొండయ్య, నర్సింహులు మాట్లాడారు. అంతకు ముందు పాత బీరప్ప దేవాలయంలో మహిళలు జలకడవలతో నీళ్లుపోశారు. కార్యక్రమంలో కుర్మసంఘం నాయకులు భూమల్లరాజు, లింగం, బీరయ్య, కనకయ్య, మల్లయ్య, తిరుపతి, రవి, మల్లయ్య, కిట్టు, మల్లేశం పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలి

కొమురవెల్లి, మే 31: మండలంలోని మర్రిముచ్చాల పంచాయతీ కార్యదర్శి రాజమణిని బదిలీ చేయాలని కోరుతూ శనివారం ఆ గ్రామస్తులు అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో పాటు ఎంపీడీవో శ్రీనివాస్‌వర్మకు వినతిప్రతాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో కూడా పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన రాజమణి పలు విషయాల్లో ఇబ్బంది పెట్టిందని, దీంతో అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆమెను బదిలీ చేసినట్లు తెలిపారు. బదిలీలో భాగంగా మరోసారి పంచాయతీ కార్యదర్శిగా మర్రిముచ్చాలకు వచ్చిన ఆమె దాదాపు సంవత్సరం నుంచి మళ్లీ గ్రామస్తులను ఇబ్బందులు పెడుతున్నదని, ఏమైనా పర్మిషన్లు కావాలంటే నెలల తరబడి తిప్పించుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మర్రిముచ్చాల గ్రామస్తులు

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తాం

హుస్నాబాద్‌టౌన్, మే 31: లంబాడీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్‌ను రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిస్తామని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజునాయక్ అన్నారు. హుస్నాబాద్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 10శాతం ఉన్న లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించలేదని విమర్శించారు. లంబాడీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్పా ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. నామినేటెడ్ పదవులు సైతం లంబాడీలకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీలను అణగదొక్కుతున్న సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం పక్కకు తప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించకుంటే మంత్రులను గ్రామాల్లోకి రాకుండా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ రామచందర్‌నాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సత్యంనాయక్, లంబాడీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు భూక్యా కృష్ణానాయక్, నాయకులు భూక్యా మోతీలాల్‌నాయక్, భూక్యా తిరుపతినాయక్, గుగులోతు రవినాయక్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాజునాయక్

టీచర్ల సర్దుబాటు ఉపసంహరించుకోవాలి

చేర్యాల, మే 31: ఉపాధ్యాయులను సర్దుబాటు పేరిట ఇతర పాఠశాలలకు తరలించాలనే ప్రభుత్వ నిర్ణయం ప్రాథమిక విద్యారంగానికి గొడ్డలిపెట్టని, తక్షణమే ఉపసంహరించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం చేర్యాల పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని, అభ్యసన సామర్థ్యాలు పెంచాలని, అందుకు ఉపాధ్యాయులే బాధ్యత వహించాలని చెప్పిన అధికారులు సర్దుబాటు పేరిట పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా చేయడం దారుణమన్నారు. సామాజిక బాధ్యతగా వేసవి సెలవుల్లోనే విద్యార్థుల నమోదు కోసం తమ సంఘం విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేసిందన్నారు. 10 మందిలోపు ఒక ఉపాధ్యాయుడు, 11 నుంచి 60మంది వరకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉండాలని ఆదేశించడం సమంజసం కాదన్నారు. అనేక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60లోపే ఉంటుందని, దీనిని సాకుగా చూపి ఉపాధ్యాయులను తొలగిస్తే తల్లిదండ్రులకు నమ్మకం ఎలా కలుగుతుందని ప్రశ్నించారు.

ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

గజ్వేల్, మే 31: మున్సిపల్ కార్యాలయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జీవో 93 వల్ల ఉద్యోగులకు అన్యాయం జరగడంతో కోర్టును ఆశ్రయించామని, ప్రభుత్వం సానుకూలంగా తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కింద స్థాయి ఉద్యోగులకు ఉద్యోగోన్నతుల్లో అన్యాయం జరుగుతుందనే విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీడీఎంఏ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేసి సమస్యలు వివరించామన్నారు. సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్, మధుసూదన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభాకర్‌యాదవ్, వెంకటగోపాల్

పోరాటాలతో సమస్యలు పరిష్కారం

చేర్యాల, మే 31: పోరాటాలతో సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. పట్టణంలో శనివారం సీపీఐ13వ మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలో సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం షాదీఖానలో నాయకులు కత్తుల భాస్కర్‌రెడ్డి, అరిగే కావ్య అధ్యక్షతన సభ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, పొన్నబోయిన మమత, ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, కుడిక్యాల బాల్‌మోహన్, వలబోజు నరసింహాచారి, జెర్రిపోతుల జనార్దన్, రామగళ్ల నరేశ్, నంగి కనకయ్య, గూడెపు సుదర్శన్, చుంచు అశోక్, బంగారు ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాల